క్లుప్తంగా

యుద్ధ విద్యలో రాణించాలి

కొందుర్గు: విద్యార్థులు చదువుతోపాటు యుద్ధ విద్యలో రాణించాలని జిల్లేడ్ చౌదరిగూడ మండలం రావిర్యాల పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్ సూచించారు. పాఠశాలకు చెందిన పలువురు విద్యార్థులకు న్యూ మాంక్స్ కుంగ్‌ఫూ ఆధ్వర్యంలో మాస్టర్ రాజు కరాటేలో ఉచిత శిక్షణ అందిస్తున్నారు. ఈ సందర్భంగా మాస్టర్ రాజును హెచ్‌ఎం అభినందించారు. కరాటేలో ప్రతిభ చూపిన విద్యార్థి సంధ్యకు గ్రామస్తులు నర్సింలు కుంగ్‌ఫూ డ్రెస్‌ను బహూకరించారు. కార్యక్రమంలో న్యూ మాంక్స్ కుంగ్‌ఫూ రంగారెడ్డి చీఫ్ ఇన్‌స్ట్రక్టర్ రమేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోండి

కొందుర్గు: ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ మహేష్‌బాబు సూచించారు. జిల్లేడ్ చౌదరిగూడ మండలం వీరన్నపేట, చేగిరెడ్డి ఘనాపూర్ గ్రామాల్లో శుక్రవారం సురక్ష బీమా యోజన, ప్రధాన మంత్రి జీవన జ్యోతి పథకాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. 18నుంచి 70 సంవత్సరాల మధ్య వయస్సు వారు ఏడాదికి రూ. 20 ప్రీమియం చెల్లిస్తే రూ. 2లక్షల ప్రమాద బీమా వర్తిస్తుందన్నారు. అదేవిధంగా ఏడాది రూ. 456 ప్రీమియం చెల్లిసే ప్రమాదవశాత్తు మరణిస్తే రూ. 4లక్షలు సాధారణ మరణానికి బీమా సౌకర్యం ఉంటుందన్నారు. కార్యక్రమంలో బ్యాంక్ మేనేజర్ సుధీర్, ఏపీఎం రామస్వామి, సీసీలు రమేష్, దేవయ్య పాల్గొన్నారు.

రేపు గురుకుల ప్రవేశ పరీక్ష

షాద్‌నగర్ రూరల్: మండలంలోని కమ్మదనం గ్రామ శివారులో గల గురుకుల పాఠశాలలో 2023 – 24 విద్యా సంవత్సరానికి గాను 5వ తరగతిలో ప్రవేశం పొందేందుకు ఈ నెల 23న పరీక్ష నిర్వహిస్తున్నట్లు ఆ పాఠశాల ప్రిన్సిపాల్ విద్యుల్లత శుక్రవారం తెలిపారు. ఉదయం 11నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్ష ఉంటుందని తెలిపారు. పరీక్ష రాసేందుకు వచ్చే విద్యార్థులు హాల్ టికెట్, ఆధార్ కార్డు, పాఠశాల బోనఫైడ్‌ను విధిగా తెచ్చుకోవాలని సూచించారు. పరీక్ష కేంద్రంలోకి సెల్ ఫోన్లు, గడియారాలు, ఎలక్ట్రానిక్ పరికరాలను అనుమతించమని తెలిపారు. పరీక్ష సమయం కంటే ముందే విద్యార్థులు కేంద్రానికి చేరుకోవాలని ఆమె తెలిపారు.

చేవెళ్ల గురుకుల పాఠశాలలో..

మొయినాబాద్ రూరల్: మండలంలోని తోల్‌కట్ట సమీపంలో గల చేవెళ్ల గురుకుల పాఠశాలలో 5వ తరగతిలో ప్రవేశానికి పరీక్ష నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ డీ రమాదేవి తెలిపారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ ఉదయం 11 నుంచి ఒంటి గంట వరకు పరీక్ష ఉంటుందని, గంట ముందే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని రమాదేవి సూచించారు. విద్యార్థులు హాల్ టికెట్, ఆధార్ కార్డు జిరాక్స్ కాపీతో రావాలని సూచించారు. మరింత సమాచారం కోసం సెల్ నంబర్ 79950 10635లో సంప్రదించాలని ఆమె కోరారు.

నిధులు లేకుండా అభివృద్ధి సాధ్యమా ?

- పన్నులు సిబ్బంది జీతాలకే సరిపోవడం లేదు
- పంచాయతీలకు కేంద్ర, రాష్ట్ర నిధులు రావడం లేదు
- మండల సర్వసభ్య సమావేశంలో సర్పంచుల ఆవేదన
- ప్రజా సమస్యలు పరిష్కరిస్తాం: ఎంపీపీ



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ ప్రశాంతిరెడ్డి

షాబాద్: సొంత నిధులతో గ్రామాల అభివృద్ధి సాధ్యమయ్యే పనేనా అని పలువురు సర్పంచులు ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామ పంచాయతీలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు మంజూరు చేయకపోవడంతో అభివృద్ధి కుంటుపడుతోందని తెలిపారు. సమస్యలు పరిష్కరించలేక, తమను ఎన్నుకున్న ప్రజలకు సమాధానం చెప్పలేక అవస్థలు పడుతున్నామని సర్పంచులు పేర్కొన్నారు. శుక్రవారం షాబాద్ ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ కే ప్రశాంతి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి 15 మంది ఎంపీటీసీలకు గాను 8 మంది హాజరయ్యారు. 41 మంది సర్పంచులకు గాను 15 మంది హాజరయ్యారు. సమావేశ మందిరంలో సగం కుర్చీలు ఖాళీగానే దర్శనమిచ్చాయి. కొంత మంది అధికారులు వంతుల వారీగా ఎజెండాను చదివి వెళ్లిపోయారు. ముందుగా వ్యవసాయ శాఖ ఏఓ వెంకటేశం మాట్లాడుతూ.. సకాలంలో రైతు బంధు, రైతు బీమా పథకాలు అందుతున్నాయని తెలిపారు. ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి యోజన ద్వారా పది విడతలుగా డబ్బులు రైతుల ఖాతాల్లో జమ చేసినట్లు తెలిపారు. మండలంలోని తిర్మలాపూర్, రేగడిదోస్వాడ, కొమరబండ గ్రామాల్లో ఇళ్ల మధ్య ఉన్న విద్యుత్ స్తంభాలను తొలగించి రోడ్డు పక్కన నాటాలని సూచించారు. గ్రామానికి దూరం ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను గ్రామ సమీపంలో ఏర్పాటు చేయాలని పలుమార్లు విజ్ఞప్తి చేసినా పటించుకోవడం లేదన్నారు. ఏఈ నరేందర్ మాట్లాడుతూ వారం రోజుల్లో సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. ఎంపీపీ కే ప్రశాంతి రెడ్డి మాట్లాడుతూ.. సమస్యల పరిష్కారానికి అధికారులు, ప్రజా ప్రతినిధులు ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి పనులు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ అనురాధ, సహకార సంఘం చైర్మన్ శేఖర్‌రెడ్డి, తహసీల్దార్ సైదులుగౌడ్, ఎంపీఓ హన్మంత్‌రెడ్డి, ఏఈలు దివ్య, నరేందర్, శారద, వైద్యులు వరలక్ష్మి, శ్రీనివాస్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమాదేవి, ఏఓ వెంకటేశం, ఏపీఎం నర్సింహులు, ఎంఈఓ శంకర్‌రాథోడ్ తదితరులున్నారు.

సీపీఆర్‌తో ప్రాణాలు కాపాడొచ్చు

ఎమ్మెల్యే అంజయ్య యాదవ్

షాద్‌నగర్: అత్యవసర సమయాల్లో సీపీఆర్ చేసి మనిషి ప్రాణాలు కాపాడవచ్చని ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ అన్నారు. శుక్రవారం వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో పట్టణంలోని మండల పరిషత్ సమావేశ భవనంలో వివిధ శాఖ అధికారులకు సీపీఆర్‌పై శిక్షణ శిబిరాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే మాట్లాడుతూ.. హృదయ శ్వాసకోశ పునర్జీవన చర్య (సీపీఆర్) ద్వారా మనుషుల ప్రాణాలు కాపాడవచ్చని అన్నారు. ప్రస్తుతం చాలా మంది గుండె జబ్బులకు గురై హఠాన్మరణం చెందుతున్నారని అన్నారు. గుండెపోటుకు గురైన వారికి సీపీఆర్ చేయడం ద్వారా ప్రాణాపాయ స్థితి నుంచి బయటపడే అవకాశాలు ఉంటాయన్నారు. అత్యవసర సమయాల్లో సీపీఆర్ చేస్తూనే 108కు సమాచారం ఇవ్వాలన్నారు. ప్రభుత్వం సీపీఆర్‌పై విస్తృత అవగాహన కల్పిస్తోందన్నారు. సమావేశంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ జయలక్ష్మి, మాస్ మీడియా అధికారి నరహరి, జెడ్పీటీసీ వెంకట్‌రాంరెడ్డి, మున్సిపల్ చైర్మన్ కే నరేందర్, కమిషనర్ వెంకన్న, ఎంపీడీఓ వినయ్‌కుమార్, హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాసులు, డాక్టర్లు స్రవంతి, రాఘవేందర్, హెల్త్ సూపర్ వైజర్లు పుష్పలీల, చంద్రకళ, శ్రావణ్‌కుమార్, ఉదయ్‌కుమార్, రెడ్యా నాయక్ పాల్గొన్నారు.


సీపీఆర్‌పై అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారులు

సీపీఆర్‌పై అవగాహన

షాబాద్: గుండెపోటుకు గురైనప్పుడు ప్రజలు ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలని అన్నదానిపై డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ దామోదర్ పలు సూచనలు చేశారు. శుక్రవారం షాబాద్ మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ కే ప్రశాంతిరెడ్డి ఆధ్వర్యంలో సర్పంచులు, ఎంపీటీసీలు, అంగన్‌వాడీ టీచర్లు, వైద్య సిబ్బందికి సీపీఆర్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గుండెపోటు వచ్చిన వంద మందికి వెంటనే సీపీఆర్ చేస్తే 90 మంది వరకు బతికే అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ అనురాధ, డాక్టర్లు ప్రసాద్, శ్రీనివాసరావు, వరలక్ష్మి, వైద్య సిబ్బంది గోపాల్ రెడ్డి, బలరాం, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాలపై అప్రమత్తత అవసరం

ఎన్‌ఆర్‌ఎస్‌సీ గ్రూప్ డైరెక్టర్ మృత్యుంజయరెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న మృత్యుంజయరెడ్డి

షాద్‌నగర్ రూరల్: అగ్ని ప్రమాదాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఎన్‌ఆర్‌ఎస్‌సీ గ్రూప్ డైరెక్టర్ మృత్యుంజయరెడ్డి అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల ముగింపు కార్యక్రమాన్ని శుక్రవారం మండలంలోని అన్నారం ఎన్‌ఆర్‌ఎస్‌సీ కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మృత్యుంజయరెడ్డి మాట్లాడుతూ.. వేసవిలో తరుచూ అగ్ని ప్రమాదాలు జరుగుతుంటాయన్నారు. వాటి నివారణలకు ముందస్తు జాగ్రత్తలు పాటించాలన్నారు. అగ్ని ప్రమాదాలు జరిగితే వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వాలన్నారు. అగ్ని సురక్ష వారోత్సవాల సందర్భంగా నిర్వహించిన డ్రాయింగ్, పెయింటింగ్, క్విజ్ పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. అగ్నిమాపక సిబ్బంది నిర్వహించిన విన్యాసాలు అందరినీ ఆకట్టుకున్నాయి.

కాంగ్రెస్‌ను మరింత బలోపేతం చేద్దాం

పార్టీ మండల అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి

షాద్‌నగర్: గ్రామ స్థాయిలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేద్దామని ఆ పార్టీ మండల అధ్యక్షుడు చల్లా శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని కమ్మదనంలో గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ.. గత ఎన్నికల్లో బీఆర్ఎస్, బీజేపీలు ప్రజలకు మాయమాటలు చెప్పి ఓట్లు దండుకొని అధికారం చేపట్టాయని అన్నారు. అయితే ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయలేదని ఆరోపించారు. గ్రామ కమిటీ అధ్యక్షుడిగా అమర్‌నాథ్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా శేఖర్, ప్రధాన కార్యదర్శిగా అబ్దుల్లా, సహాయ కార్యదర్శిగా మాధవగౌడ్, కోశాధికారిగా నర్సింలును ఎన్నుకున్నారు. కార్యక్రమంలో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ దర్శన్, ఎంపీటీసీ బీ అరుణ, నాయకులు డీ నవీన్‌కుమార్, టీ రవీందర్‌రెడ్డి, కిష్టయ్య, సత్యనారాయణ, మాధవగౌడ్, మాధవరెడ్డి, యాదయ్య, లక్ష్మయ్య, కుమార్ తదితరులు పాల్గొన్నారు.


కమిటీ నూతన సభ్యులకు నియామక పత్రం అందజేస్తున్న శ్రీకాంత్‌రెడ్డి

హద్దులు చూపాలని ఆందోళన

తహసీల్దార్ కార్యాలయం ఎదుట మహిళా రైతు నిరసన


తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న మహిళా రైతు, తదితరులు

కేశంపేట: తన భూమిని సర్వే చేసి హద్దులు చూపాలని పదిహేను సంవత్సరాలుగా రెవెన్యూ అధికారుల చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోవడం లేదని మహిళా రైతు తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. కుల అసమానతల నిర్మూలన పోరాట సమితి, సావిత్రి బాయి పూలే మహిళ సంఘం సభ్యులు ఆమెకు మద్దతు తెలిపారు. బాధితురాలి కథనం మేరకు.. మండలంలోని కాకునూర్‌కు చెందిన వెంకటమ్మకు సర్వే నంబర్ 361లో భూమి ఉంది. 2008లో కొంత భూమిని గ్రామానికే చెందిన బీ నాగయ్య, బీ రాంచంద్రయ్య, బీ పద్మమ్మలకు విక్రయించింది. ఇంకా 20గుంటల భూమి ఆమె పేరిట ఉంది. అప్పటి నుంచి తన భూమిని సర్వే చేసి పొజిషన్ చూపించాలని పలుమార్లు రెవెన్యూ అధికారులను కోరినా వారు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ అజీం అలీ, ఎస్ఐ ధనుంజయ్ బాధిత రైతుతో మాట్లాడి వినతి పత్రం స్వీకరించారు. భూమిని సర్వే చేసి న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

డ్రైనేజీ నిర్మాణానికి భూమిపూజ

మొయినాబాద్ రూరల్: గ్రామాలను అభివృద్ధి చేసుకుందామని కాసింబౌలి సర్పంచ్ మహేందర్‌రెడ్డి, ఉప సర్పంచ్ జయరాంరెడ్డి, పంచాయతీ కార్యదర్శి మహేష్‌యాదవ్ అన్నారు. శుక్రవారం గ్రామంలో మండల పరిషత్ నిధులతో అండర్ డ్రైనేజీ పనులకు భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామాభివృద్ధికి ప్రజలు సహకరించాలన్నారు. అధికారులు, ప్రజాప్రతిధులు కల సి పని చేస్తేనే అభివృద్ధి సాధ్యమన్నారు. కార్య క్రమంలో వార్డు సభ్యులు సురేఖ, మల్లేష్, స్వప్న, జైపాల్‌రెడ్డి, అనూషా, శ్రీకాంత్, నాయకులు సుధాకర్‌రెడ్డి, రఘురాంరెడ్డి, శంకర్‌రెడ్డి పాల్గొన్నారు.

సమయాన్ని వృథా చేయొద్దు

జెడ్పీటీసీ వెంకట్‌రాంరెడ్డి

షాద్‌నగర్: విద్యార్థులు వేసవి సెలవులను సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీటీసీ వెంకట్‌రాంరెడ్డి సూచించారు. శుక్రవారం మండలంలోని కమ్మదనం గురుకుల పాఠశాలలో వార్షిక పరీక్షలు ముగించుకొని ఇళ్లకు వెళుతున్న విద్యార్థులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ మాట్లాడుతూ.. పరీక్షల సందర్భంగా విద్యార్థులు మానసిక ఒత్తిడికి గురై ఉంటారని అన్నారు. చదువుల నుంచి కొంత ఉపశమనం పొందేందుకు సెలవులు ఎంతో ఉపయోగపడతాయన్నారు. వేసవి సెలవుల్లో సమయాన్ని వృథా చేయకుండా సృజనాత్మకతను వెలికి తీసే కార్యక్రమాల్లో పాల్గొనాలని సూచించారు. అనంతరం పాఠశాలలో అంబేడ్కర్, సావిత్రి బాయి పూలే చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

శంకర్‌పల్లిని ఆదర్శంగా తీర్చిదిద్దుతాం


ప్రజా సమస్యలపై చర్చిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ విజయలక్ష్మి

మున్సిపల్ చైర్‌పర్సన్ సాత విజయలక్ష్మి

శంకర్‌పల్లి: శంకర్‌పల్లిని జిల్లాలోనే ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతామని చైర్‌పర్సన్ సీ విజయలక్ష్మి పేర్కొన్నారు. శుక్రవారం కౌన్సిలర్లు, అధికారులతో సాధారణ సమావేశం నిర్వహించారు. మున్సిపల్ పరిధిలో చేపట్టిన అభివృద్ధి పనులు, కార్మికుల జీతాలు, బిల్లుల చెల్లింపులు తదితర అంశాల చర్చించారు. ఈ సదర్భంగా ఆమె మాట్లాడుతూ.. మున్సిపాలిటీని అన్ని విధాలా అభివృద్ధి చేస్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జ్ఞానేశ్వర్, వైస్ చైర్మన్ వెంకట్‌రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డయాలసిస్ సెంటర్‌కు స్థల పరిశీలన

షాద్‌నగర్: స్థానిక ప్రభుత్వ ఆస్పత్రి ఆవరణలో డయాలసిస్ సెంటర్ భవన నిర్మాణానికి శుక్రవారం దివ్యశక్తి పరిశ్రమ యజమాని అగర్వాల్, టీఆర్ఎస్ నేత మురళీ యాదవ్ స్థలాన్ని పరిశీలించారు. ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ పిలుపు మేరకు దివ్యశక్తి పేపర్ మిల్ నిర్వాహకులు 10 పడకలతో కూడిన నూతన భవన నిర్మాణానికి ముందుకు వచ్చారు. డయాలసిస్ సెంటర్‌లో రోగులకు కావాల్సిన అన్ని సదుపాయాలను కల్పించనున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కే నరేందర్, నాయకులు కే శంకర్, సీ నర్సింహ, డాక్టర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అన్ని పండుగలకు సముచిత స్థానం

ఎమ్మెల్యే కాలె యాదయ్య


మొయినాబాద్‌లో ముస్లింలకు కానుకలు అందజేస్తున్న ఎమ్మెల్యే

మొయినాబాద్: రాష్ట్ర ప్రభుత్వం అన్ని పండుగలకు సముచిత స్థానం కల్పిస్తున్నట్లు ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. రంజాన్ పండుగను పురస్కరించుకుని శుక్రవారం మొయినాబాద్‌లో ప్రభుత్వం తరఫున ముస్లింలకు రంజాన్ కానుకలు అందజేశారు. అనంతరం ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం కేసీఆర్ తొమ్మిదేళ్ల పాలనలో రాష్ట్రంలో అన్ని కులాలు, మతాలకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీఓ వేణుమాధవరావు, తహసీల్దార్ అశోక్‌కుమార్, జెడ్పీటీసీ శ్రీకాంత్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కే అనంతరెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ రవూఫ్, మైనార్టీ విభాగం నాయకుడు షేక్ మహబూబ్, పీఏసీఎస్ డైరెక్టర్ జగన్‌మోహన్‌రెడ్డి, సర్పంచ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీల సంక్షేమానికి కృషి

షాబాద్: మైనార్టీల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. శుక్రవారం షాబాద్ దర్గాలో ఇఫ్తార్ విందుకు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఎస్ శ్రీనివాస్‌గౌడ్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు రాజేందర్‌గౌడ్‌తో హాజరయ్యారు. మత పెద్దలతో కలిసి ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో మైనార్టీ విభాగం రాష్ట్ర నాయకుడు ఎంఏ మతిన్, ఇమ్రాన్, మజీద్, అరీఫ్, అన్వర్, ముఖ్రం ఖాన్, యూసుఫ్, గౌస్ తదితరులు పాల్గొన్నారు.

మత సామరస్యానికి ప్రతీక ఇఫ్తార్

షాబాద్: మత సామరస్యానికి ప్రతీకలు ఇఫ్తార్ విందులని మాజీ కో–ఆప్షన్ సభ్యుడు సయ్యద్ అయూబ్ అన్నారు. శుక్రవారం మండలంలోని పోతుగల్‌లో మైనార్టీలకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అన్ని వర్గాల ప్రజలకు బీఆర్ఎస్ ప్రభుత్వం అండగా ఉంటోందన్నారు. కార్యక్రమంలో సీతారాంపూర్ ఉప సర్పంచ్ సందీప్, మైనార్టీ నాయకులు మునీర్ పాల్గొన్నారు.

ప్రార్థనలకు ఏర్పాట్లు

షాద్‌నగర్ టౌన్: రంజాన్ పండుగ సందర్భంగా ఫరూఖ్‌నగర్ ఈద్గా వద్ద ప్రార్థనలు చేసేందుకు శుక్రవారం ఏర్పాట్లను ప్రారంభించారు. బీఆర్ఎస్ పార్టీ మైనార్టీ విభాగం నేత జమృత్‌ఖాన్ ఆధ్వర్యంలో పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో షబ్బీర్ అలీ, గౌస్ జానీ, తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా పండుగలు జరుపుకోవాలి

మొయినాబాద్ రూరల్: పండుగలను అందరూ కలసి ప్రశాంతంగా జరుపుకోవాలని పీసీసీ సభ్యుడు దర్శన్, ప్రైవేటు ఇంజనీరింగ్ కళాశాలల రాష్ట్ర చైర్మన్ గౌరి సతీష్, తోల్‌కట్ట మాజీ సర్పంచ్ బీ సత్యనారాయణలు అన్నారు. మండలంలోని తోల్‌కట్ట గ్రామంలో ముస్లింలకు మాజీ సర్పంచ్ బీ సత్యనారాయణ ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కే మానయ్య, నాయకులు బాలకృష్ణారెడ్డి, పీసీసీ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి మహేందర్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ ఉచిత ఇంటర్నెట్ సదుపాయం

చేవెళ్ల: విద్యార్థులకు నాణ్యమైన బోధన చేయాలన్న సంకల్పంతో కేంద్ర ప్రభుత్వం ప్రతి ఇంటికీ ఉచిత ఇంటర్‌నెట్ సదుపాయం కల్పిస్తోందని కందవాడ ఉప సర్పంచ్ జీ కావ్య తెలిపారు. కేంద్ర ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చిన టీ ఫైబర్‌లో ప్రజలను చేర్పించే కార్యక్రమాన్ని శుక్రవారం పట్టణంలో నిర్వహించారు. కార్యక్రమంలో పంచాయతీ పాలకవర్గం సభ్యులు పీ రవీందర్, బీజేపీ గ్రామ అధ్యక్షుడు జీ శ్రీపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


చేవెళ్ల: ఉచిత ఇంటర్నెట్ సేవలపై అవగాహన కల్పిస్తున్న నేతలు

రేపు చేవెళ్లలో బీజేపీ యాత్ర

శంకర్‌పల్లి: చేవెళ్లలో శనివారం నిర్వహించనున్న బీజేపీ విజయ సంకల్ప యాత్రను విజయవంతం చేయాలని ఆ పార్టీ శంకర్‌పల్లి మండల అధ్యక్షుడు బీ రాములుగౌడ్ పిలుపునిచ్చారు. శుక్రవారం మండలంలోని మోకిల గ్రామంలోని పార్టీ కార్యాలయంలో విజయ సంకల్ప యాత్రపై నాయకులతో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని గద్దె దింపి, బీజేపీని అధికారంలోకి వచ్చేందుకు చేవెళ్ల నియోజకవర్గం నుంచే యాత్రను ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమ ప్రారంభోత్సవానికి అమిత్‌షా హాజరవుతున్నట్లు చెప్పారు. పార్టీ కార్యకర్తలు, నాయకులు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని పిలుపునిచ్చారు. చేవెళ్ల గడ్డపై బీజేపీ జెండా ఎగరడం ఖాయమన్నారు. కార్యక్రమంలో పార్టీ చేవెళ్ల అసెంబ్లీ కన్వీనర్ ప్రతాప్‌రెడ్డి, కిసాన్ సెల్ సభ్యుడు కృష్ణారెడ్డి, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి రాజేందర్ సింగ్, మండల మాజీ అధ్యక్షుడు నర్సింహారెడ్డి, నాయకులు ప్రభాకర్‌రెడ్డి, లింగం యాదవ్, టీ రవి, రామకృష్ణారెడ్డి తదతరులు పాల్గొన్నారు.